


ముగిసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల (నూనెపల్లె), మే 31: రాష్ట్ర వ్యాప్తంగా జరగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలలో పది పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. శుక్రవారం సాంఘిక శాస్త్రం పరీక్షకు 2,455 మంది విద్యార్థులకు గాను 873 మంది విద్యార్థులు హాజరు కాగా 1582 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో సుధాకరరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు, 11 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయని తెలిపారు.

వెరైటీ బెట్టింగులు



- గెలుపు, ఓటముల కంటే గ్రామాల్లో మెజార్టీ, పోస్టల్ బ్యాలెట్‌పైనే ఆసక్తి
- ముఖ్య నాయకుల మెజార్టీపై కూడా..
- నంద్యాల పార్లమెంట్‌లో కొత్త రకం పందేలు


సార్వత్రిక ఎన్నికల సమరం-2024 ఫలితాల ఓట్ల లెక్కింపు తేదీ దగ్గర పడుతున్న కొద్ది పందెం రాయుళ్ళు రూటు మార్చి కొత్త కొత్త రకాల పందేలకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా నియోజకవర్గాల వారీగా పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములపై బెట్టింగులు కాస్తుంటారు. ఈసారి పోలింగ్ పూర్తయిన వెంటనే తమ పార్టీ అభ్యర్థులే కచ్చితంగా గెలుస్తారని, మెజార్టీ ఇన్ని వేలు రావడం ఖాయమని ఎవరైనా పందెం కాస్తే ఒకటికి రెండు ఇస్తామంటూ మొదట బెట్టింగు రాయుళ్ళు తెరపైకి వచ్చారు. అయితే పోలింగ్ పూర్తయ్యాక నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లోని పోలింగ్ బూత్‌ల వారీగా నమోదైన పోలింగ్ శాతం ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీన్ని బట్టి అప్పటి వరకు ధీమాగా పందెం కాసిన వారంతా ఉన్నట్లుండి మౌనం పాటించారు. పోలింగ్ రోజున నమోదైన ఓట్ల శాతంలో తమకు పట్టున్న ప్రాంతాల్లో ఓటింగ్ శాతం 50 శాతానికి పడిపోవడమే పందెంరాయుళ్లు డీలా పడటానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

నంద్యాల టౌన్, మే 31: నంద్యాల పార్లమెంట్ పరిధిలో నంద్యాల, ఆళ్ళగడ్డ, బనగానపల్లె, నందికొట్కూరు, డోన్, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం 7 నియోజకవర్గాలతో పాటు ఎంపీ స్థానంలో పోటీ చేసిన అభ్యర్థులు కూడా భారీ మెజార్టీతో గెలుస్తారని అధికార పార్టీ నాయకులు పోలింగ్ ముందు రోజు వరకు బుకాయిస్తూ ప్రచారంలో డాంబికాలకుపోయారు. అధికార పార్టీని ఎదుర్కొనేందుకు సై అంటే సై అంటూ ప్రతిపక్ష ప్రధాన పార్టీ ఢీ కొనడం, అధికార పార్టీ కంటే మిన్నగా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ మేనేజ్‌మెంట్‌తో పాటు, ఓటర్లకు డబ్బు పంపిణీలో కూడా ధీటుగా సమాధానం ఇచ్చిన నేపథ్యంలో పోలింగ్ రోజున అధికార పార్టీకి వ్యతిరేకంగా కూటమికి ప్రజా మద్దతు రెట్టింపు స్థాయిలో లభించినట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేశారు. దీంతో తమదే గెలుపు అంటూ పోలింగ్ ముందు రోజు వరకు ధీమాగా ఉన్న అధికార పార్టీ అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. పోలింగ్ మరుసటి రోజు నుంచి తమ గుబులు బయట పడకుండా, ప్రతిపక్ష పార్టీ ఓడిపోవడం ఖాయమంటూ బెట్టింగ్‌లకు తెరలేపారు. పోలింగ్ ముగిసిన మూడో రోజుకు పోలింగ్ బూతుల వారీగా అధికారికంగా నమోదైన పోలింగ్ శాతాలు చూసి అధికార పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గుతుందని వెల్లడి కావడంతో గెలుపు, ఓటములపై బెట్టింగు రాయుళ్లు ఉన్నట్లుండి మౌనం పాటించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో గెలుపు, ఓటములపై బెట్టింగుల ప్రభావం తగ్గిపోయింది.

ముఖ్య నాయకుల మెజార్టీలపై బెట్టింగులు

రాష్ట్రంలోని ప్రముఖ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు పోటీ చేసిన స్థానాల్లో వారి మెజార్టీలపై కూడా జిల్లాలో పలు ప్రాంతాల్లో బెట్టింగులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఒక కొత్త ధోరణి అని రాజకీయ పరిశీలకులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు.

- కుప్పంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మెజార్టీ 70 వేల ఓట్లకుపైగా మెజార్టీ వస్తుందని గ్రామాల్లో రూ.25 వేల నుంచి రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు.
- పిఠాపురంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, హిందూపురంలో బాలకృష్ణకు, మంగళగిరిలో నారా లోకేష్‌కు ముగ్గురికి కలిపి వచ్చే మెజార్టీ పులివెందులలో జగన్‌కు వస్తుందని ఓ వైసీపీ నాయకుడు ఒకటికి మూడు అని సై అనడంతో ఏకంగా రూ.50 లక్షలతో నలుగురు వ్యక్తులు కలిసి పందెం కాశారు. ఈ పందెంలో వైసీపీ నాయకుడు ఓడిపోతే రూ.1.50 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.
- మంగళగిరిలో నారా లోకేష్ మెజార్టీ 30 వేలకుపైగా ఉంటుందని, పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌కు మెజార్టీ 50 వేల ఓట్లకుపైగానే ఉంటుందని గ్రామాల్లో పందేలు కాస్తున్నారు. ఇలాంటి పందేల వల్ల ఓట్ల లెక్కింపునకు ముందు మరింత ఉత్కంఠ వాతావరణం నెలకొన్నది.



గ్రామాల్లో మెజార్టీపై.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై పందేలు

ఓట్ల లెక్కింపు తేదీ దగ్గర పడుతున్న కొద్దీ పందేల రూటు మారింది. గ్రామాల వారీగా మెజార్టీపై, పోస్టల్ బ్యాలెట్‌లో మెజార్టీపై వినూత్నంగా పందేలకు శ్రీకారం చుట్టారు.



- రాష్ట్రంలోనే పోస్టల్ బ్యాలెట్ల నమోదులో నంద్యాల జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. శ్రీకాకుళం జిల్లా తరువాత నంద్యాల జిల్లాలోనే 25,283 పోస్టల్ బ్యాలెట్లు నమోదయ్యాయి. దీంతో నంద్యాల పార్లమెంట్‌లో అసెంబ్లీ నియోజవర్గాల వారీగా పోల్ అయిన పోస్టల్ బ్యాలెట్లల్లో ఉద్యోగ వర్గాలందరూ అధికార పార్టీకి వ్యతిరేకంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, మెజార్టీపై పందేలకు బెట్టింగు రాయుళ్లు తెరపైకి రావడంతో పోస్టల్ బ్యాలెట్ల మెజార్టీపై విస్తృతంగా పందేలు కాస్తున్నారు.
- నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని గోస్పాడు మండలంలో ఓ గ్రామంలో గత ఎన్నికల్లో దాదాపు 650 ఓట్ల మెజార్టీ అధికార పార్టీకి వచ్చింది. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో గ్రామంలో పరిస్థితులు మారినప్పటికీ అధికార పార్టీకి 300 మెజార్టీ వస్తుందని ఆ గ్రామానికి చెందిన నాయకుడు పందేనికి సై అనడంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు 300 మెజార్టీ ఎట్టి పరిస్థితుల్లో అధికార పార్టీకి రాదని రూ.10 లక్షలు పందేనికి సై అన్నట్లు సమాచారం.
- బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో ఓ మండలంలో గత ఎన్నికల్లో వైసీపీకి భారీ మెజార్టీ రాగా ప్రస్తుత ఎన్నికల్లో అక్కడ టీడీపీకే మెజార్టీ వస్తుందని జోరుగా పందేలు సాగుతున్నాయి. ఇదే నియోజక వర్గంలోని మరో మండలంలో ఓ ప్రముఖ నేత సొంత గ్రామంలో వైసీపీకి భారీగా మెజార్టీ గండి పడుతుందని పందేలు కాస్తున్నారు.
- శ్రీశైలం నియోజకవర్గంలో మూడు మండలాల్లో వైసీపీ అభ్యర్థికి భారీగా మెజార్టీకి గండి పడిందని, మెజార్టీ అంచనాలపై రూ.లక్షల్లో పందేలు ఊపందుకున్నాయి. గత ఎన్నికల్లో అధికార పార్టీకి ఏక పక్షంగా ఓట్లు పడిన గ్రామాల్లో టీడీపీకి మెజార్టీ ఖాయమంటూ మరో రకం పందేలు ముందుకు వచ్చాయి.
- పాణ్యం నియోజకవర్గంలో కల్లూరు మండలం ఓటర్లు అధికార పార్టీకి జలక్ ఇచ్చారని, వైసీపీ నాయకులు అంచనా వేసుకుంటున్నట్లుగా మెజార్టీ వచ్చే ప్రసక్తేలేదని టీడీపీ నాయకులు ఒకటి రెండు సై అంటూ పందేలు కలుపుతున్నారు.
- నందికొట్కూరు నియోజకవర్గంలో ముఖ్య నాయకులు, పోటీలో నిలబడిన అభ్యర్థుల సొంత గ్రామాల్లో మెజార్టీపై పందేలు జోరందుకున్నాయి. ఇక్కడ అధికార పార్టీ తరపున స్థానికేతర వ్యక్తి పోటీలో ఉండటంతో టీడీపీ అభ్యర్థికి భారీ మెజార్టీ వచ్చే అవకాశం కూడా ఉందంటూ జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. దీంతో కొందరు రూ.లక్షల్లో పందేలు కాస్తున్నారు.
- ఆళ్ళగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీకి మద్దతుగా ఓటర్లు తీర్పు ఇచ్చారని, వైసీపీ అభ్యర్థి ఓడిపోవడం ఖాయమంటూ బెట్టింగులు ఊపందుకున్నాయి. ఈ నియోజకవర్గంలోని మొత్తం 6 మండలాల్లో కొన్ని చోట్ల క్రాస్ ఓటింగ్ కూడా జరిగిందని, క్రాస్ ఓటింగ్‌కు అవకాశం ఉన్న గ్రామాల్లోని పోలింగ్ బూతుల వారీగా కూడా పందేలు జరుగుతున్నాయి.
- డోన్ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు, ఓటములు, మెజార్టీలపై జోరుగా పందేలు జరుగుతున్నాయి. అధికార పార్టీ అభ్యర్థి ఓడిపోవడం ఖాయమని కూడా పందేలు కాస్తున్నట్లు సమాచారం.

డోన్‌లో కేసుల కలకలం

- ఇప్పటికే 13 మంది అధికారులపై కేసు
- టీడీపీ నాయకుడు కోట్రికే ఫణిరాజ్ దంపతులు టార్గెట్?
- గతంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేసిన గాయత్రీ దేవి


కోట్రికే ఫణిరాజ్

డోన్, మే 31: డోన్ మున్సిపాలిటీలో గతంలో పని చేసిన ముగ్గురు కమిషనర్లు, ఏడుగురు ఇంజనీరింగ్ అధికారులు, ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై డోన్ పట్టణ పోలీసులు కేసులు నమోదు చేయడం కలకలం రేపుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ పరిధిలో నిధుల దుర్వినియోగం, నిబంధనలు ఉల్లంఘించి చెల్లింపులు చేశారని విజిలెన్స్ అధికారులు ఎప్పుడో ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడు పోలీసులు కేసులు నమోదు చేశారు. వైసీపీకి వ్యతిరేకంగా పని చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, ఆయన సతీమణి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రికే గాయత్రీదేవి దంపతులను మంత్రి బుగ్గన టార్గెట్ చేసి కేసులు నమోదు చేసినట్లు విమర్శలున్నాయి. మున్సిపాలిటీలో గతంలో పని చేసిన ఓ డ్రైవర్‌తో ఫిర్యాదు చేయించి కోట్రికే ఫణిరాజ్ దంపతుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో 14, 15గా పొందుపరిచినట్లు సమాచారం. దీనిపై మున్సిపల్ అధికారులు మండిపడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు డోన్ మున్సిపల్ చైర్మన్‌గా కోట్రికే గాయత్రీదేవి పని చేశారు. ఆమె భర్త కోట్రికే ఫణిరాజ్ కౌన్సిలర్‌గా పని చేశారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఫణిరాజ్ ఉన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి బుగ్గన టీడీపీ నేత కోట్రికే ఫణిరాజ్‌ను అప్పట్లో టార్గెట్ చేశారు. మున్సిపాలిటీలో చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో నిధులు దుర్వినియోగం చేశారని, వాహనాలకు డీజిల్ కొనుగోలులో నిబంధనలు ఉల్లంఘించారని విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. మంత్రి బుగ్గన ఆదేశాల మేరకు 2021లోనే విచారణ పూర్తి చేసి విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.27.23 లక్షల నిధులు దుర్వినియోగం చేసినట్లు విజిలెన్స్ అధికారులు తేల్చారు. ఉన్నట్టుండి ఇప్పుడు విజిలెన్స్ అధికారుల విచారణ నివేదిక తెరపైకి వచ్చింది. మంత్రి బుగ్గన ఒత్తిడి మేరకే ప్రభుత్వం నుంచి డోన్ మున్సిపల్ కమిషనర్ జయరామ్‌కు విజిలెన్స్ అధికారుల నివేదిక ఆధారంగా కేసులు నమోదు చేసేలా ఫిర్యాదు చేయాలని ఆదేశాలు వచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో మున్సిపల్ కమిషనర్ జయరాం గురువారం డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 13 మంది ప్రభుత్వ ఉద్యోగులపై పోలీసులు కేసులు నమోదు చేయడం కలకలం రేపుతోంది.

13 మంది అధికారులపై కేసు

డోన్ మున్సిపల్ కమిషనర్ జయరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో మున్సిపల్ కమిషనర్లుగా పని చేసిన కృష్ణమూర్తి, రమేష్‌బాబు, రాజు ఎబినేజర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా డీఈఈలు సురేంద్రనాథ్, వేణుగోపాల్, ఏఈలు రామ్మూర్తి, శ్రీనివాసులు, రాజు నాయక్, లక్ష్మి సువర్ణ, రూపేష్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పురుషోత్తం, ప్రహ్లాద, శబరీష్‌లపై కేసు నమోదు చేశారు. కృష్ణమూర్తి, రాజు ఎబినేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంలు పదవీ విరమణ పొందారు. ఇక్కడ పని చేసిన మిగతా కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్నారు. 13 మంది మున్సిపల్ ఉద్యోగులపై కేసులు నమోదు కావడం ఒక్కసారిగా డోన్ మున్సిపాలిటీని కుదిపేసింది.

8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం


పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), మే 31: పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని పాణ్యం రిటర్నింగ్ అధికారి, కర్నూలు జిల్లా జేసీ నారపురెడ్డి మౌర్య వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ అనంతరం 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గం కౌంటింగ్ ఏర్పాట్లపై మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ రాయలసీమ యూనివర్సిటీలోని మొదటి అంతస్తు ఇంజనీరింగ్ బ్లాకులో జరుగుతుందన్నారు. పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేశామని అన్నారు. 5,700 పోస్టల్ బ్యాలెట్‌లను 6 టేబుళ్ల ద్వారా రెండు రౌండ్లలో లెక్కిస్తారని అన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ 26 రౌండ్లలో పూర్తి అవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఇతర ఎన్నికల సిబ్బంది గుర్తింపు కార్డులతోనే కేంద్రంలోకి రావాలని ఆమె సూచించారు.

పోస్టల్ బ్యాలెట్లను జాగ్రత్తగా లెక్కించాలి


ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుపై శిక్షణనిస్తున్న కలెక్టర్

పాణ్యం, మే 31 : ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా స్వీకరించిన పోస్టల్ బ్యాలెట్ పత్రాలను జాగ్రత్తగా లెక్కించాలని కలెక్టరు, ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 4 వతేదీన జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో భాగంగా చేపట్టే ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా స్వీకరించిన పోస్టల్ బ్యాలెట్ పత్రాల లెక్కింపు విధానంపై శుక్రవారం ఆర్జీఎం కళాశాలలో ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్ సిస్టంను చక్కగా నిర్వహించాలన్నారు. వాటి లెక్కింపునకు సంబంధించి ప్రత్యేకంగా టేబుళ్లను, స్కానర్లను ఏర్పాటు చేయించామన్నారు. సర్వీసు ఓటర్లు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఏవిధంగా లెక్కిస్తారనేవిధానంపై డెమో నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఏకకాలంలో జరుగుతుందన్నారు. ముందుగా ఫారం 13 సీలోని కవర్ తెరచి బయట ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలన్నారు. ఒకదాని తర్వాత మరొకటి లెక్కించాలన్నారు. క్యూఆర్ కోడ్ చెకింగ్ వలన ఎటువంటి డూప్లికేట్ ఓట్లకు అవకాశం ఉండదన్నారు.

నంద్యాలలో పోలీసుల మాక్ డ్రిల్

నంద్యాల క్రైం, మే 31: నంద్యాల జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని శ్రీనివాససెంటర్ వద్ద ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైనప్పుడు అల్లరి మూకలను ఏవిధంగా అదుపు చేస్తూ చెదరగొట్టాలో భద్రతాదళాలకు సూచించారు. అల్లరి మూకలను ఎలా తరిమికొట్టాలో, విధ్వంసానికి యత్నించేవారిని అణచివేసి పరిస్థితులను ఎలా అదుపులోకి తేవాలో, గాయపడినవారికి చికిత్స అందించడం, సామాన్యులకు ఇబ్బందికలగకుండా చూడటం వంటి అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. పోలీసులు, అల్లరి మూకల మధ్య గొడవలు జరిగిన విషయంలో కల్పిత పాత్రలతో పోలీసులు ఆందోళనకారులుగా వేషం వేసి రాళ్లు విసిరినట్లు చేశారు. అనంతరం అల్లరిమూకలపై పోలీసులు టియర్‌గ్యాస్, తుపాకులతో ఫైరింగ్, వజ్ర వాహనంతో ఫైరింగ్, లాఠీచార్జి చేసే ప్రక్రియను కర్నూలు పోలీసులు మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించారు. మాక్‌డ్రిల్ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, నంద్యాల టౌన్ డీఎస్పీ ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి, నంద్యాల సబ్ డివిజన్‌లోని సీఐలు నరసింహులు, చలపతి, రాజారెడ్డి, శివకుమార్‌రెడ్డి, దస్తగిరిబాబు, ఇస్మాయిల్, ఏఆర్‌సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు మల్లికార్జున, వెంకటసుబ్బయ్య, నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగిన ఈ ఫ్లాగ్‌మార్చ్ పట్టణంలోని శ్రీనివాస సెంటర్, గాంధీచౌక్, ముల్లాన్‌పేట, ఆత్మకూరు బస్టాండ్, ఫరూక్‌నగర్, సిటీ బస్టాండు, పద్మావతి నగర్, టెక్కె తదితర ప్రాంతాల్లో సాగింది.


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పొగాకుతో పెరుగుతున్న మరణాల రేటు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

నంద్యాల (నూనెపల్లె), మే 31: ప్రపంచ వ్యాప్తంగా పొగాకు పదార్థాల వినియోగం వల్ల మానవుల మరణాల రేటు ప్రతి ఏడాది పెరుగుతోందని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఆర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంఅండ్ హెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు పదార్థాలను వినియోగించడంతో ఊపిరి తిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పక్షవాతం, శ్వాసకోశ వ్యాధులు వస్తాయని, ధూమపానంతో మానసిక ఆరోగ్య రుగ్మతలను కలుగజేస్తాయని అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ఈ ఏడాది పొగాకు కంపెనీల నుంచి చిన్న పిల్లలను కాపాడాలనే నినాదం తీసుకున్నట్లు తెలిపారు. యుక్త వయసులో ఉన్నవారు, ఫ్యాక్టరీ కార్మికులు, పొగాకు రైతులు, గర్భిణులు, పాఠశాల విద్యార్థులకు పొగాకుతో కలిగే సమస్యలను వివరించేందుకు కార్యక్రమాలు జరగుతాయన్నారు. జూన్ 5వ తేదీ నుంచి పొగాకు రహిత సమాజం కోసం 20 రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ శారదా బాయి, ఎన్‌సీడీ జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ ఎన్‌హెచ్ నిర్వహణ అధికారి డాక్టర్ సునీత, డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ అధికారి ప్రసన్న లక్ష్మి ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ యశోద పాల్గొన్నారు.

అంచనాలు తారుమారు..!

- కౌంటింగ్‌కు ముందే చేతులెత్తేసిన వైసీపీ
- అయినా కింది స్థాయి నేతలను రెచ్చగొడుతున్న వైనం
- వైసీపీ గెలుపుపై పందెంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు
- ప్రతి సవాల్ విసురుతున్న తెలుగు తమ్ముళ్లు

'మంత్రాలయం వైసీపీ అభ్యర్థి బాలనాగిరెడ్డి గెలుస్తాడు.. జగన్ సీఎం అవుతాడు. రూ.20 లక్షలు పందెం పెడుతున్నా.. దమ్మున్న వాళ్లు ఎవరైనా ఉంటే శనివారం ఉదయం 10 గంటలకు యల్లమ్మగుడి వద్దకు రావాలి'
- కోసిగి వైసీపీ మాజీ జడ్పీటీసీ దళవాయి మంగమ్మ సవాల్.

'ఓ మంగమ్మ..! మంత్రాలయం టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘువేంద్రరెడ్డి గెలుస్తాడు. చంద్రబాబు సీఎం అవుతాడు. నా రెండు ఎకరాలు పొలం పందెం పెడుతున్నా. బోరు బావి కూడా ఉంది. ఆ పొలం విలువ రూ.50 లక్షలు ఉంటుంది. నరసప్ప గుడి వద్దకు వస్తా.. మీకు దమ్ముంటే రండి'
- మంత్రాలయం మండలం వగరూరుకు చెందిన టీడీపీ కార్యకర్త మాంత్రికి చిన్నన్న ప్రతి సవాల్



కర్నూలు, మే 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపుపై ఆయా పార్టీల శ్రేణులు పందెం నీదా.. నాదా సై అంటూ బహిరంగ ఛాలెంజ్‌లతో రాజకీయం వేడెక్కింది. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కోసిగి మండలం వైసీపీ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు దళవాయి మంగమ్మ ముందుగా ఓపన్ ఛాలెంజ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియో చూసిన టీడీపీ వీరాభిమాని వగరూరు చిన్నన్న రెండెకరాల పొలం పందెం పెడుతున్నాను అంటూ ప్రతి సవాల్ విసిరాడు. ఈ వీడియోలు పరిశీలిస్తే గెలుపుపై అంచనాలు సన్నగిల్లడంతో ప్రత్యర్థి పార్టీ శ్రేణులను రెచ్చగొట్టేందుకే వైసీపీ నాయకులు బెట్టింగ్ ఛాలెంజ్‌కు తెర తీశారనే రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వ్యూహంలో భాగంగానే వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మాజీ జడ్పీటీసీ మంగమ్మ ద్వారా ఛాలెంజ్ చేయించి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో కూడా కీలకమైన నామినేటెడ్ పదవిలో ఉన్న వైసీపీ నాయకుడు ఒకరు 'మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. రూ.50 లక్షలు పందెం.. దమ్ముంటే పందెం పెట్టేందుకు రండి..' అంటూ ఛాలెంజ్ విసిరినట్లు తెలిసింది. ఈ రెండు నియోజకవర్గాల్లోనే కాదు.. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితే ఉందని తెలుస్తుంది. పోల్ మేనేజ్‌మెంట్‌లోనూ.. డబ్బులు పంపకంలోనూ.. గ్రామాలకు గ్రామాల్లోనే తమకు అనుకూలత రెట్టింపు చేసుకున్నాం.. మాదే పైచేయి అంటూ మొదట్లో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. పోలింగ్ తరువాత లెక్కలు వేసి ఎంతెంత మెజార్టీ వస్తుందో ప్రచారం కూడా చేసుకున్నారు. తాజా పరిస్థితులు చూసిన వైసీపీ నాయకులు, ఆ పార్టీ అభ్యర్థులకు గెలుపు ఆశలు సన్నగిల్లడంతో ప్రత్యర్థి పార్టీ శ్రేణులను రెచ్చగొట్టే ఎత్తులు వేస్తున్నారని, అందులో భాగమే పందెం అంటూ ఓపన్ చాలెంజ్‌లు చేస్తున్నారు.

జిల్లాలో టీడీపీ సత్తా చాటుతుంది

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ మొత్తం స్థానాల్లో విజయం సాధించింది. టీడీపీ ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేపోయింది. అయితే ప్రస్తుతం మాత్రం మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తామని టీడీపీ శ్రేణులు ధీమాగా ఉన్నారు. అదే క్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని అంచనాలు వేస్తూ చెబుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు చేస్తుందంటూ కర్నూలు నగరానికి చెందిన ఓ వ్యక్తి రూ.15 లక్షలు పందెం కాశారు. ఆదోనికి చెందిన ఓ వ్యక్తి వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందంటూ కర్ణాటక రాష్ట్ర శిరుగుప్పలో రూ.5 లక్షలు బెట్టింగ్ పెట్టారు. అయితే శిరుగుప్పలో ఉన్న సెటిలర్స్ (కోస్తాంధ్ర ప్రాంతం వారు) కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని... రూ.లక్షకు రూ.2 లక్షలు ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చారు. వైసీపీ శ్రేణులు మాత్రం ఈ బంపర్ ఆఫర్‌ను ఏమాత్రం స్వీకరించడం లేదు. పొత్తుల్లో భాగంగా ఆదోని సీటు బీజేపీకి ఇవ్వడం, కూటమి అభ్యర్థిగా డాక్టరు పార్థసారథి బరిలో దిగడంతో.. అక్కడ వైసీపీ అభ్యర్థి వై.సాయిప్రసాద్‌రెడ్డి 75 వేలు నుంచి లక్ష మెజార్టీతో గెలుస్తారని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకున్నారు. పోలింగ్ నాటికి పరిస్థితులు మారిపోయాయి. పోలింగ్ దగ్గర పడేకొద్దీ అదే నేతలు 5 నుంచి 15 వేల ఓట్లతో తెలుస్తామంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం మెజార్టీ చెప్పలేం.. గెలుపు మాత్రం మాదే అంటూ మళ్లీ మాట మార్చేశారు. వైసీపీ గెలుస్తుందని ఆ పార్టీ అభిమాని అయిన న్యాయవాది ఒకరు రూ.లక్ష పందెం పెట్టారు. కూటమి అభ్యర్థి పార్థసారథి గెలుస్తాడంటూ టీడీపీ నాయకుడు ఒకరు రూ.2 లక్షలు పందెం పెట్టినట్లు తెలిసింది. కర్నూలులో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ గెలుపుపై పెద్ద ఎత్తున బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. ఆలూరులో టీడీపీ అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ గెలుస్తారని బళ్లారికి చెందిన ఓ కాంట్రాక్టరు రూ.లక్షల్లో బెట్టింగ్ పెట్టినట్లు సమాచారం. ఎక్కువ శాతం రాష్ట్రంలో టీడీపీ సారథ్యంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్న దానిపై బెట్టింగ్ కాసినట్లు తెలుస్తుంది.

పోలీసులుగా పదవీవిరమణ
పొందడం గర్వకారణం
ఎస్పీ జి.కృష్ణకాంత్



పదవి విరమణ పొందిన పోలీస్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

కర్నూలు, మే 31: సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో పని చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పదవి విరమణ పొందిన 9 మంది పోలీసులను ఎస్పీ పూలమాలలు, శాలువలతో సన్మానించారు. పదవి విరమణ పొందిన వారిలో ఎస్. అబ్దుల్ అజీజ్ (వీసీఆర్, కర్నూలు ఎస్ఐ), డి. రాజన్న (స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ), ఎస్ఎండీ జాఫర్ హుశేన్ (కర్నూలు వన్‌టౌన్ ఎస్ఐ), పీవీ రామిరెడ్డి (కర్నూలు వన్‌టౌన్ ఎస్ఐ), ఎస్. చంద్రశేఖర్ రావు (ఏఆర్ఎస్ఐ), ఎస్.చెంచయ్య (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్), జి.ఇన్నయ్య (కర్నూలు ఒకటో పట్టణ ఏఎస్ఐ), ఎస్‌జీ నజీర్ అహ్మద్ (చిప్పగిరి పీఎస్ ఏఎస్ఐ), ఆర్.హరిబాబు (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్)లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, ఆర్ఐలు జావేద్, నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, పదవి విరమణ పొందిన పోలీసుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెరువును ఆక్రమించుకున్న రియల్ వ్యాపారి
ఆందోళనకు దిగిన గ్రామస్థులు

ప్యాపిలి, మే 31: ప్యాపిలిలో చెరువు భూమిని ఆక్రమించుకున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. చెరువు ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు, రైతులు శుక్రవారం ఆక్రమిత భూమి దగ్గర ఆందోళన చేశారు. పట్టణం సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన 896 సర్వే నెంబరులో నాయుడి చెరువు ఉంది. ఈ చెరువు పక్కనే ఓ రియల్ వ్యాపారి దాదాపు 20 ఎకరాల పొలం కొని వెంచర్ వేస్తున్నాడు. పనిలో పనిగా ఎవరూ అడగరు కదా దాదాపు ఎకరా చెరువు భూమిని ఆక్రమించాడు. ఈ భూమి విలువ రూ.లక్షల్లో పలుకుతోంది. రియల్ వ్యాపారి ఆక్రమణ సంగతిని పలుమార్లు రెవెన్యు అధికారుల దృష్టికి గ్రామస్తులు, రైతులు తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు, గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రియల్ వ్యాపారి దౌర్జన్యంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించు కున్నారని ఆరోపించారు. అలాగే ప్రభుత్వ భూమిలో ఉన్న నాలుగు బోర్లను కూడ పూడ్చి వెంచర్ వేశారన్నారు. రియల్ వ్యాపారి దౌర్జన్యాన్ని ఆపకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లుతామని రైతులు హెచ్చరించారు. అనంతరం వారు ఆర్ఐ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు, రైతులు టి శ్రీనివాసులు, గడ్డం భువనేశ్వరరెడ్డి, బోరెడ్డి క్రిష్టారెడ్డి, రజనీ కాంత్‌రెడ్డి, కొండయ్య, గండికోట పెద్దరామాజినేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం
మరొకరికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా, మే 31: మండలంలోని పారుమంచాల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ద్విచక్రవాహనంపై వెళుతూ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు క్షతగాత్రుడ్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బుధవారపేటకు చెందిన వెంకటేశ్వర్లు పారుమంచాల గ్రామానికి చెందిన రాములమ్మను పెళ్లి చేసుకుని ఇక్కడే గౌండా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు ఇరువురు జూపాడుబంగ్లాకు ద్విచక్రవానంపై పని నిమిత్తం వచ్చి తిరిగి వెళుతుండగా పారుమంచాల చెక్‌పోస్టు మలుపు వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు(40) అక్కడిక్కడే మృతిచెందాడు. నాగేశ్వరరావుకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడ్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా
డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హస్పిటల్), మే 31: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా సిటీ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సూపరింటెండెంట్ చాంబరులో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి నుంచి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యసిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రికి సంబంధించిన ఫైల్స్‌ను సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్‌కు మించిన సేవలు అందించాలని అందుకు అందరూ సహకరించాలన్నారు. తన మొదటి ప్రాధాన్యత రోగులకు మెరుగైన సేవలు అందించడమేనని ఆసుపత్రిని ప్రక్షాళన చేయడమే లక్ష్యమన్నారు. అందరి సహకారంతో ఆసుపత్రి రూపురేఖలు మారుస్తానని, అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానన్నారు.

పరీక్షల కోసం రూ.లక్షల్లో వసూలు
డీఈఓపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ

కర్నూలు ఎడ్యుకేషన్/ఆదోని అగ్రికల్చర్, మే 31: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ టెన్త్, ఇంటర్) పరీక్షల కోసం డీఈఓ శామ్యూల్ రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆదోని డెవలప్‌మెంట్ ఫోరం ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఓ లేఖ వైరల్ అవుతోంది. పైగా ఈ ఫిర్యాదును లోకాయుక్తకు, కలెక్టర్‌కు అందజేసినట్లుగా ఉండటం చర్చనీయంశమైంది. జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయకుండా ఉండేందుకు రూ.20 లక్షలు మామూళ్లు తీసుకున్నట్లు కలెక్టర్‌కు, లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు ఆదోని డెవలప్‌మెంట్ ఫోరం లెటర్‌హెడ్‌తో ఓ లేఖ విడుదలైంది. ప్రస్తుతం లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆదోని, ఎమ్మిగనూరు పరీక్ష కేంద్రాలు తనిఖీ చేయకుండా పాఠశాల నిర్వాహకులు, జిల్లా విద్యాశాఖ అధికారి మధ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ లేఖ సారాంశం. దీనిపై పూర్తి వివరాలు తమ దగ్గర ఉన్నాయంటూ అందులో పేర్కొన్నారు. విచారణ చేసి జిల్లా అధికారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదోని డెవలప్‌మెంట్ ఫోరమ్ లెటర్‌హెడ్ పేరిట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్‌రావు, పి.వెంకటేశ్, ఉపాధ్యక్షులు కిరణ్మయిలు ఈ ఫిర్యాదు చేసినట్లు ఉంది.

ఈ విషయంపై డీఈఓ శామ్యూల్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. గత మార్చి, ఏప్రిల్ నెలలో జరిగిన పరీక్షలను తాము పకడ్బందీగా నిర్వహించామన్నారు. ఫలితంగా పరీక్షల ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గిందన్నారు. మాస్ కాపీయింగ్ చేయిస్తామని కొందరు నిర్వాహకులు ఒక్కో విద్యార్థి నుంచి రూ.8వేల దాకా వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జూన్ 1వ తేదీ నుంచి జరిగే పరీక్షలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఒక కళాశాల యజమాన్యం నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని తెలిపారు. త్వరలోనే ఆ కళాశాల ప్రభుత్వ గుర్తింపును రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈవో వివరించారు.

ఎన్నికల ఫలితాలను మీడియాకు అందించండి

జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన



అధికారులకు సూచనలుఇస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన, ఎస్పీ జి. కృష్ణకాంత్

కర్నూలు(కలెక్టరేట్), మే 31: కమ్యూనికేషన్ సెంటర్ల ద్వారా త్వరితగతిన ఎన్నికల ఫలితాలను మీడియాకు అందించాలని కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని మీడియా, కమ్యూనికేషన్ సెంటరులో ఏర్పాట్లను కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. 4 టీవీలలో, 4 న్యూస్ చానల్స్ మొత్తం 8 న్యూస్‌చానల్స్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మీడియా ప్రతినిధులు కౌంటింగ్ హాలులో విజువల్స్ తీసుకునేందుకు 5 నుంచి 6 మందిని వాహనంలో తీసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సమాచార పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు. మీడియా ప్రతినిధులకు మీడియా సెంటరు వరకు మాత్రమే మొబైల్ ఫోన్ల అనుమతి ఉందని, కౌంటింగ్ హాలులోకి అనుమతి లేదని తెలియజేశారు. ఇంజనీరింగ్ బ్లాకులోని కంట్రోల్, కమ్యూనికేషన్ రూమ్‌ను పరిశీలిస్తూ కమ్యూనికేషన్ రూమ్ అని తెలిసేవిధంగా బోర్డు, కౌంటింగ్ రిజర్వుడ్ సిబ్బంది లైబ్రరీ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో కూర్చునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ రిజర్వుడ్ సిబ్బంది అనే బోర్డు కూడా ఏర్పాటు చేయించాలని డీఆర్వోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, కుడా వైస్ చైర్మన్ వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి ప్రతాప్ రెడ్డి, సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి జయమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ హక్కులపై నిర్లక్ష్యమేనా..?

- శిథిలావస్థకు చేరిన ప్రాజెక్టులపై నూతన ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- జూన్ 10న సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవం
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న సాధన సమితి నాయకులు

నంద్యాల టౌన్, మే 31 : రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాలైనా రాయలసీమ హక్కుల అమలుపై పాలకులు నిర్లక్ష్యం వహించారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మరికొద్ది రోజుల్లో నూతన ప్రభుత్వం ఏర్పడబోతున్న సందర్భంగా రాయలసీమ ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశం నంద్యాలలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమ అభివృద్ధికి ఉన్న అనేక హక్కులను అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్ చేపట్టిన కృష్ణా జలాల పంపకం వలన తెలుగుగంగ, గాలేరు -నగరి, హంద్రీ-నీవా, వెలుగొండ ప్రాజెక్టులకు 100 సంవత్సరాల్లో ఒకటి లేదా రెండు సంవత్సరాలలో మాత్రమే నీరు లభించే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ ఇబ్బందులను అధిగమించడానికి దుమ్ముగూడెం, నాగార్జునసాగర్ ఆయకట్టుకు గోదావరి నీరు అందించి కృష్ణా జలాలను పై ప్రాజెక్టులకు అందించాల్సి ఉందని అన్నారు. విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నిధుల మళ్లించడం వల్ల తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణం ముందుకు సాగడం లేదని అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమ ప్రాజెక్టుల నిర్వహణకు కూడా సరిగా నిధులు కేటాయించకపోవడంతో రాయలసీమలో నికర జలాలపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు.

కొత్త ప్రభుత్వం దృష్టికి రాయలసీమ సమస్యలు

రాయలసీమ ప్రజల హృదయ స్పందన సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవాన్ని జూన్ 10న సంగమేశ్వరం వద్ద ఘనంగా నిర్వహించాలని తీర్మానించినట్లు బొజ్జా తెలిపారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న సాగునీటి ప్రాజెక్టుల సత్వరం పూర్తి చేయాలని, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సక్రమ నిర్వహణకు చేపట్టాల్సిన అంశాలపై నివేదికను నూతన ప్రభుత్వానికి అందించాలని సమావేశంలో తీర్మానించారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా చేపట్టాల్సిన హైకోర్టు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్, అనేక రాష్ట్రస్థాయి కార్యాలయాలు, కార్పొరేషన్‌ల ఏర్పాటుపై నివేదికను నూతన ప్రభుత్వానికి అందించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో రాయలసీమ విద్యావంతుల వేదిక పాణి, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రత్నం ఏసేపు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జన విజ్ఞాన వేదిక సభ్యులు శేషాద్రిరెడ్డి, రైతు కూలీ సంఘం కన్వీనర్ సుంకన్న, సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, బీకేఎస్ కడప జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ఐదుగురు డీబార్

కర్నూలు(అర్బన్), మే 31: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన 4వ సెమిస్టర్ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో 3,156 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 2,893 మంది హాజరయి పరీక్షలు రాశారని తెలిపారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఉంచాలి
- ఓట్ల లెక్కింపు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ, ఎస్పీలు



విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న డీఐజీ

కర్నూలు, మే 31: జూన్ 4వ తేదీన కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలో జరగనున్న సార్వత్రిక ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు తెలిపారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ డా.జి. సృజన, ఎస్పీ జి. కృష్ణకాంత్‌తో కలిసి డీఐజీ భద్రతా ఏర్పాట్లను పరిశలించారు. విజిటర్స్ రిజిస్టర్‌లో డీఐజీ సంతకం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్, కౌంటింగ్ హాల్‌ను, భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం ఓట్ల లెక్కింపునకు తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్ల గురించి డీఐజీ తాలుకా పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలతో దిశా నిర్దేశం చేశారు. ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సిలింగ్ చేయాలని, నిఘా ఉంచాలన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులు చేయాల్సినవి, చేయకూడని వాటి గురించి తెలియజేయాలన్నారు. భద్రతపరంగా కౌంటింగ్ సెంటరు వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. గుంపులు గుంపులుగా గుమికూడి ఉండకుండా చర్యలు తీసుకోవలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రం వచ్చే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. గుర్తింపు కార్డును పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు గుర్తింపు కార్డులను, ఆర్వోలు ఇచ్చే ధృవీకరణ పత్రాన్ని తనిఖీ చేసి పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే వారు మొబైల్స్ తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సెంటర్‌కు వచ్చే అభ్యర్థులు వార ఏజెంట్లకు సంబంధించిన వాహనాలు వారికి నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే ఉంచేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఐజీ వెంట అడిషనల్ ఎస్పీ నాగరాజు, నాగబాబు, డీఎస్పీలు విజయశేఖర్, బాబు ప్రసాద్, సీతారామయ్య, శివనారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, ట్రైనీ డీఎస్పీ భావన సీఐలు ఉన్నారు.

ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు

మంత్రాలయం, మే 31: మంత్రాలయంలో రామచంద్రనగర్ టవర్ సమీపంలో 135/2 సర్వే నెంబరులోని ప్లాట్ నెంబర్.68 అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ రామదాసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. శుక్రవారం ఎమ్మిగనూరు చెందిన వాసు లీలావతికి చెందిన ప్లాట్‌నెం.68పై దొంగ డాక్యుమెంట్లను సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారు. బాధితురాలు వాసులీలావతి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో సబ్ రిజిస్ట్రార్‌తోపాటు మంత్రాలయంకు చెందిన మారెప్ప, మందాకిని, ముకుంద, మహేశ్వర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రిపై కొడుకుల దాడి



గాయపడ్డ మజ్జిగ నాగప్ప

ఆస్పరి మే 31: మండలంలోని అటేకల్ గ్రామంలో ఆస్తి విషయంలో తండ్రిపై కుమారులు దాడి చేసినట్లు సీఐ హనుమంతప్ప శుక్రవారం తెలిపారు. అటేకల్ గ్రామానికి నాగప్ప తన కుమారులు ప్రకాష్, మస్తాన్ ఆస్తి విషయంలో తగాదా పడ్డారన్నారు. తమకు న్యాయం చేయడం లేదని, తండ్రిపై కుమారులు దాడి చేయడంతో తలకు గాయాలైనట్లు సీఐ తెలిపారు. బాధితుడు నాగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సాగునీటి కష్టాలు

● చెరువు కట్టకు, అలుగుకు గండ్లు ● నీరు చేరితే కట్టలు తెగే ప్రమాదం ● బీళ్లుగా మారిన భూములు



పాణ్యం ఊరిముదరి చెరువు తూముకు ఏర్పడిన గండ్లు



పాణ్యం చెరువు కట్టకు ఏర్పడిన గండి



భూపనపాడు అలుగు గండితో వాగులో వృథాగా చేరుతున్న నీరు

పాణ్యం, మే 31: చెరువుల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో చెరువుల కింద సాగవుతున్న పంటభూముల పరిస్థితి ఆందోళనగా మారింది. చెరువుల కట్టలు బలహీనంగా మారి గండ్లు ఏర్పడి ఎప్పుడు తెగుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. కొన్ని చెరువులు ఆక్రమణకు గురైనా చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష ధోరణి వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువుల తూములు శిథిలావస్థకు చేరాయి. చెరువుల కట్టలపై పెద్దపెద్ద చెట్లు పెరిగి వేర్లు కిందికి దిగి కట్టలు పగుళ్లతో బీటలుగా మారాయి. గత ఐదేళ్ల కాలంలో చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వకపోవడం శోచనీయం. పాణ్యం మండలంలో ఆరు చెరువులు ఉన్నాయి. కొండజూటూరు చెరువు కింద 208. 08 ఎకరాలు, ఆలమూరు చెరువు కింద 172. 59 ఎకరాలు, కొల్లమాకుల చెరువు కింద 200ఎకరాలు, భూపనపాడు చెరువు కింద 450 ఎకరాలు, వద్దుగండ్ల చెరువు కింద 127 ఎకరాలు, పాణ్యం ఊరిముందరి చెరువు కింద 327. 75 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. చుట్టూనీరున్నా పంటలకు అందని దుస్థితి ఒకవైపు, చెరువు తూము లీకేజీలతో బీడుగా మారిన పరిస్థితి మరోవైపు. పాణ్యం ఊరి ముందరి చెరువు కింద 200 ఎకరాల ఆయకట్టు ఉంది. గుండాల వద్ద గల తూము లీకేజీలతో నీరు పంట పొలాలలో చేరి దాదాపు 150 ఎకరాల సాగు భూములు బీళ్లుగా మారాయి. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో 2021 జూలైలో ఆంధ్రజ్యోతి ద్వారా కలెక్టరు, చిన్ననీటిపారుడల శాఖ ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లగా అధికారులు స్పందించారు. రూ. 3.90 లక్షలతో లీకేజీల నివారణకు ప్రతిపాదనలు పంపించారు. అయినా ఇంత వరకు ఎటువంటి పనులు చేపట్టకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సార్బీసీకి ఏర్పాటు చేయని తూము

1994లో ఎస్సార్బీసీ ప్రధాన కాలువను నిర్మించారు. ఈ కాలువ చెరువుకు పైభాగాన ఉండడంతో వర్షాకాలంలో కొండలోని నీరు చెరువులో చేరక కాలువలో పడుతుండడంతో చెరువు నిండక పంటభూములు ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. దీంతో చెరువు నింపడానికి కాలువకు గండ్లు ఏర్పాటు చేసి వాగుల ద్వారా చెరువును నింపుకుంటున్నారు.. కాలువ నిర్మాణ సమయంలో చెరువు ఉందన్న ఉద్దేశంతో జలవనరుల శాఖ ఈప్రాంతంలో తూము ఏర్పాటు చేయకపోవడంతో ఈపరిస్థితి ఏర్పడినట్లు రైతులు చెబుతున్నారు.

రూ.3.34 కోట్లతో ప్రతిపాదనలు

2023లో చెరువులకు తూముల ఏర్పాటుకు చిన్ననీటిపారుదల శాఖ రూ. 3. 34 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర కమిషనర్‌కు పంపించింది. ఇందులో ఆలమూరు చెరువుకు రూ. 43 లక్షలు, కొండజూటూరు చెరువుకు రూ. 63 లక్షలు, పాణ్యం ఊరిముందరి చెరువుకు రూ. 93 లక్షలు, భూపనపాడు చెరువుకు రూ.45 లక్షలు, చిలకల చెరువుకు రూ. 90 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. కాగా తూముల ఏర్పాటుకు రాతినేలలు కారణంగా చూపి ప్రతిపాదనలు తిరస్కరించారు. దీంతో చెరువులు నింపుకోవడానికి అనువైన తూములు లేకపోవడంతో ఎస్సార్బీసీ కాలువకు గండ్లు చేసి అక్రమంగా సాగునీరు పారించుకొని చెరువులు నింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైల్వే ప్రొటెక్ట్ ట్యాంక్స్‌కు ప్రతిపాదనలు

ఏటా రైల్వే ప్రొటెక్ట్ ట్యాంక్స్ కింద ప్రతిపాదనలు రైల్వేశాఖ పంపించారు. పాణ్యం, కొండజూటూరు, చిలకల, కొల్లమాకుల చెరువులను రైల్వే ప్రొటెక్ట్ ట్యాంక్స్ కింద నిర్ణయించారు. ఈ చెరువులకు ఏదైనా ప్రమాదం జరిగి నీరు వరదలా మారితే వీటి కింద గల రైల్వే ట్రాక్ దెబ్బతినే ప్రమదముందన్న కారణంతో చెరువుల అభివృద్ధికి ఏటా నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నారు. కాగా గత ఐదేళ్ల కాలంలో ఎలాంటి నిధులు మంజూరు కాకపోడం గమనార్హం.

బీళ్లుగా మారిన పంట పొలాలు

తూముల లీకేజీలు, చెరువుల గండ్లతో చెరువుల కింద సాగవుతున్న వందలాది ఎకరాల పంట భూములు బీళ్లుగా మారాయి. చెరువుకు నిండా నీరు చేరితే నిత్యం లీకేజీలతో నీరు వృథాగా కింది పొలాల్లోకి చేరుతుంది. ఇప్పటికే పంట పొలాలలో జంబు, ముళ్ల పొదలు పెరిగి సన్న, చిన్నకారు రైతులు సాగుకు దూరమై తీవ్రంగా నష్టపోయారు. లీకేజీల మరమ్మతులు చేపడతే తప్ప రైతులకు సాగు భూములు అందుబాటులో రాని పరిస్థితి ఏర్పడింది. ఈ సాగుభూములను ఎక్కువగా కౌలు రైతులు సాగు చేసుకుంటున్నారు. లీకేజీలు పెరిగి చెరువు కట్టకు గండ్లు పడి తెగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాణ్యం, ఆలమూరు గ్రామాలలోని దాదాపు 400 ఎకరాల పంట భూములు నిరుపయోగంగా మారాయి.

తూములు, అలుగుల లీకేజీలు

పాణ్యం ఊరిముందరి చెరువు గుండాల తూము కట్టకు గండ్లు పడడంతో నీరు చేరి ఎప్పుడు తెగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూపనపడు చెరువు అలుగుకు గండి పడి నిత్యం నీరు సమీప వద్దెల వాగులో చేరి నీరు వృథా అవుతోంది. కొండజూటూరు చెరువు అలుగు పూర్తిగా దెబ్బతినడంతో నీరు వృథాగా కిందికి వెళుతోంది. నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. అలాగే చెరువులో అక్రమంగా రహదారి ఏర్పాటు చేసి, చెరువు స్థలాన్ని ఆక్రమించినా అధికారులు నిర్లక్షధోరణి వహించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలుగు వద్ద గండ్లతో నీటి వృథా



భూపనపాడు చెరువు అలుగుకు గండి ఏర్పడి నీరు వృథాగా వెళ్లి వద్దెల వాగులో కలుస్తోంది. సాగుకు అవసరమైన నీటి వృథాను అరికట్టాలి. కట్టపై చెట్లు పెరిగి అడివిలా తయారైంది. మైనర్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళాం. నిధుల కొరతతో చెరువు అభివృద్ధి పనులు జరగడం లేదు. గతంలో కట్టపై వాహనాలు వెళ్లేవి. ప్రస్తుతం నడవలేని పరిస్థితి ఏర్పడింది. తూము శిథిలమై తాళం పని చేయడం లేదు. అలుగు గండి పూడ్చి నీటి వృథాను అరికట్టాలి.

– సునీల్, టీడీపీ నాయకుడు, భూపనపాడు

అనుమతులు ఇవ్వలేదు

పాణ్యం మండలంలోని ఆరు చెరువులకు తూముల ఏర్పాటుకు 2024లో రూ. 3.34 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి పంపించాము. ప్రతిపాదనలు పంపిన స్థలాలు రాతి నేలలు కావడంతో అనుమతులు ఇవ్వలేదు. చెరువులను నీటితో నింపడానికి అనువైన సాంకేతిక పనులను పరిశీలించి త్వరలో మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తాం. చెరువులకు పడిన గండ్లు పూడ్చడానికి 2022లో ప్రతిపాదనలు పంపాం. ఈ ఏడాది మళ్లీ ప్రతిపాదనలు తయారు చేయాల్సిఉంది.

అర్జున్‌సింగ్, ఎంఐ ఏఈ

'యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి'



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఆర్

నంద్యాల టౌన్, మే 31: చిరుధాన్యాల సాగుకు మేలైన వంగడాలతో పాటు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులను పొందవచ్చునని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అఖిల భారత చిరుధాన్యాల సమన్వయ, పరిశోధనా పథకం ఆధ్వర్యంలో ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా చిరుధాన్యాలపై అగాహన, శిక్షణా కార్యక్రమాన్ని సరళమ్మ అధ్యక్షతన నిర్వహించారు. రంగాపురం, పెండేకల్ గ్రామ రైతులకు చిరుధాన్యాల రకాలు, యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించడంతో పాటు నూతన వంగడాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఆర్ మాట్లాడుతూ చిరుధాన్యాలకు మార్కెట్‌లో ధర ఎక్కువ ఉండటం కూడా రైతులకు శుభసూచిక అని అన్నారు. ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాతమ్మ మాట్లాడుతూ చిరుధాన్యాల పంటలు ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసుకోవచ్చునని, అన్ని కాలాలకు అనువైన పంటలు చిరుధాన్యాలు అని అన్నారు. వర్షాలు ఆలస్యమైనప్పుడు వేసుకోవాల్సిన పంటల గురించి వివరించారు. సస్య విజ్ఞానం శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.నరసింహులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విడుదలైన వివిధ వంగడాలను, సాగు మెళకువల గురించి వివరించారు. డాక్టర్ కె. వెంకటరమణమ్మ చిరుధాన్యాల ప్రాసెసింగ్ గురించి, చీడ పీడల, యాజమాన్యం పద్ధతుల గురించి తెలియజేశారు. సస్య విజ్ఞానం శాస్త్రవేత్త డాక్టర్ పి.పుల్లిబాయ్, శాస్త్రవేత్త ఎం.జ్యోత్స్న కిరణ్మయి జొన్నలో రకాలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

'నాణ్యమైన విత్తనాలు అందించాలి'

నందికొట్కూరు, మే 31: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా ప్రభుత్వం ఇంత వరకు రైతులకు సబ్సిడీ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించలేదని, వెంటనే అందించాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న ప్రభుత్వం ఇంత వరకు రైతులకు సబ్సిడీ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించలేదని, సహకార బ్యాంకు ద్వారా పంట రుణాలు ఇవ్వలేదని అన్నారు. సీపీఐ నాయకులు సుంకన్న, ప్రసాద్, యోహాను, జయన్న తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు రూరల్, మే 31: నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఈ సమావేశానికి ప్రతి గ్రామం నుంచి ప్రజాప్రతినిధులు, 12 గ్రామ పంచాయతీలలో ఉన్న అన్ని కార్యాలయాల ప్రభుత్వ అధికారులు పాల్గొన వలసివుండగా కొంతమంది అధికారులు, కేవలం ఆరుగురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కోరం ఉండడంతో సమావేశం నిర్వహించామని అధికారులు తెలిపారు. బొల్లవరం గ్రామ సర్పంచ్ వీరం జయమ్మ, శాతనకోట సర్పంచ్ జనార్దన్, కోనేటమ్మపల్లె ఎంపీటీసీ, ఎంపీపీ అయిన మురళీక్రిష్ణారెడ్డి మాత్రం ఆయా గ్రామాలలో విద్యుత్ స్తంభాల కొరత ఉందని తెలిపారు. బొల్లవరంలో తాగునీటి సమస్య కూడా ఉందన్నారు. రెవెన్యూ అధికారులు ఎన్నికల డ్యూటీకి వెళ్లారని సమాధానం ఇచ్చారు. విద్యుత్ ఏఈ కూడా గైర్హాజరయ్యారు. ఎక్కువ శాతం హాజరు కాకపోవడంతో గ్రామాలలో సమస్యలను అడిగే ప్రజాప్రతినిధులు లేకపోవడంతో సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. కార్యక్రమంలో జడ్పీటీసీ కల్లీముస్నీసా, ఈవోఆర్డీ సంజన్న, ఏవో నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీకి సెల్ నెంబర్‌ను ముడిపెట్టొద్దు: సీపీఐ

నందికొట్కూరు, మే 31: స్థానిక నందికొట్కూరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓపికి సెల్ నెంబర్‌ను ముడిపెట్టవద్దని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురామ్మూర్తి డా.రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సెల్ ఫోన్ ఉండదని, సెల్ నెంబర్ లేకపోతే ఓపి విభాగంలో ఓపి ఇవ్వబోమని చెప్పడం సమంజసం కాదన్నారు. 50 నుంచి 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు, సెల్ నెంబర్‌లు లేని వారు హాస్పిటల్‌లో వైద్య సౌకర్యాలు అందక వెళ్లిపోతున్నారని అన్నారు. సెల్ నెంబర్ లేని వాళ్లకి ఆధార్ కార్డు ద్వారా ఓపి ఇచ్చి వారికి మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. సానుకూలంగా స్పందించిన జనరల్ ఫిజీషియన్ డా.రాజశేఖర్ హాస్పిటల్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి సెల్ నెంబర్ లేని వారికి ఆధార్ అనుసంధానంతో ఓపి ఇచ్చి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.

'రుణాలు అందజేయాలి'

నంద్యాల (నూనెపల్లె), మే 31: జిల్లాలో రాబోయే వర్షాకాలం దృష్ట్యా రైతులకు సకాలంలో విత్తనాలు ఎరువులను అందజేసి సహకార బ్యాంకు ద్వారా సబ్సిడి రుణాలు అందజేసి ఆదుకోవాలని సీపీఐజిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాయలంలో వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాల ముఠా నాయకుడికి తొత్తులుగా వ్యవహరిస్తున్న వ్యవసాయాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలి విత్తనాలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.

'అంకితభావంతో ఉద్యోగులకు గుర్తింపు'



జానకీరామ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మే 31: విధినిర్వహణలో ఉద్యోగులు అంకితభావాన్ని కనబర్చినప్పుడే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని ఆత్మకూరు ఎంఈవో-2 సురేష్‌కుమార్ అన్నారు. ఆత్మకూరు ఎంఈవో-1 జానకీరామ్ ఉద్యోగ విరమణ పొందడంతో శుక్రవారం ఆయనకు స్థానిక ఎమ్మార్సీ కేంద్రం నందు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 34ఏళ్ల సుదీర్ఘకాలం పాటు విద్యారంగంలో వివిధ హోదాల్లో అంకితభావం, నిబద్ధతతో ఎంఈవో జానకీరామ్ పనిచేశారని చెప్పారు. ప్రత్యేకించి 24ఏళ్ల పాటు గణిత ఉపాధ్యాయునిగా పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. అలాగే పదేళ్లుగా మండల విద్యాశాఖాధికారిగా పనిచేసిన ఆయన ఆత్మకూరు ప్రాంతంలోని మారుమూల చెంచుగూడేల్లో సైతం విద్యాభివృద్ధికి ఏనలేని సేవలందించారని కొనియాడారు. అలాగే గత ఏడాది జిల్లాలోనే అత్యధికంగా విద్యార్థుల గ్రాస్ ఎంరోల్‌మెంట్ నమోదును పూర్తిచేశారని వివరించారు. అనంతరం ఎంఈవో జానకీరామ్ మాట్లాడుతూ.. అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని అలాంటి వృత్తిలో తాను కొనసాగడం గర్వంగా ఉందని చెప్పారు. వృత్తిపరంగా తాను అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నా వాటన్నింటి స్ఫూర్తితో ముందకెళ్లి విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేశానని అన్నారు. అలాగే తన శిష్యులు ఎంతో మంది ఉన్నత స్థాయిల్లో ఉన్నారని అదే వృత్తిలో తాను సాధించిన చక్కటి విజయాలను చెప్పుకొచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూర్‌అహ్మద్, హుసేన్‌సాహెబ్, చాంద్‌బాషా, సాంబశివుడు, జాకీర్, దామరేకుల రవి, భవిత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి'



ఆత్మకూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



బ్రాహ్మణకొట్కూరులో..

ఆత్మకూరు, మే 31: సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరు సహకరించాలని డీఎస్పీ రమణారావు కోరారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ నుంచి గౌడ్‌సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్ మీదుగా పోలీసుస్టేషన్ వరకు పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీశైల నియోజకవర్గం పరిధిలో సార్వత్రిక ఎన్నికలను మే 13వ తేదిన ప్రశాంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. ఇదేక్రమంలో జూన్ 4న జరిగే ఎన్నికల ఫలితాలు కూడా ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ఎన్నికల ఫలితాల అనంతరం ర్యాలీలు, సంబరాలు, సమావేశాలు, బాణాసంచా కాల్చడం వంటి వాటికి అనుమతి లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్, కొత్తపల్లి, వెలుగోడు ఎస్ఐలు హరిప్రసాద్, భూపాలుడు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్: బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో ఆత్మకూర్ డీఎస్పీ శ్రీనివాసరావు, నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి పోలీస్ కవాతు నిర్వహించారు. డీఎస్పీ, సీఐ మాట్లాడుతూ నందికొట్కూరు టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాలలో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని జిల్లా మొత్తం 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని అన్నారు. అందుకే అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కల్గిన వ్యక్తులపై నిఘా ఉంచినట్లు తెలిపారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసు అధికా రులు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు, బాణసంచా కాల్చడానికి అనుమతి లేదని చెప్పారు. కార్యక్రమంలో మిడు తూరు, జూపాడుబంగ్లా, ముచ్చుమర్రి, బ్రాహ్మణ కొట్కూరు ఎస్ఐలు జగన్మోహన్, లక్ష్మీనారాయణ, జయశేఖర్, నాగార్జున పాల్గొన్నారు. అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించి శాంతి భద్రతల గురించి వివరించారు.

2 కిలో మీటర్ల వరకు రెడ్ జోన్: ఎస్పీ



రెడ్ జోన్ ప్రాంతాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

పాణ్యం, మే 31: ఆర్జీఎంలోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలో మీటర్లు రెడ్ ఏరియాగా ప్రకటించినట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కౌంటింగ్ కేంద్రాలలోని భద్రతా సిబ్బందితో చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంల చుట్టూ రెండు కిలోమీటర్ల మేర రెడ్ ఏరియాగా ప్రకటించ డంతో ఈ ప్రాంతాలలో గగనతలంలో డ్రోన్ కార్యకలాపాలు నిషేధించినట్లు తెలిపారు. రెడ్ జోన్ నిబంధనలు వెంటనే అమలులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. రెడ్ జోన్ నిబంధనలు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'యాప్‌ల భారాన్ని తగ్గించాలి'

నంద్యాల (నూనెపల్లె), మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న వివిధ యాప్‌లతో ఉపాధ్యాయులకు పని భారం పెరుగుతోందని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శివయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న ఫేషియల్ టెండెంట్ యాప్, ఐఎస్పీ ప్యానెల్, స్మార్ట్ టీవీల సమస్యలను పరిష్కరించడానికి మండల కేంద్రంలో ఒక టెక్నీషియన్‌ను నియమించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు చేపట్టాలని, ప్రాథమిక పాఠశాలల్లో ఉండే స్మార్ట్ టీవీలల్లో వస్తున్న కార్యక్రమాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే పుస్తకాలు, బెల్టులు తదితర వాటికి సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని సచివాలయంలో పని చేసే డిజిటల్ అసిస్టెంట్, ఎమ్మార్సీ కేంద్రంలో పని చేసే సీఆర్పిలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లకిలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

మహానంది, మే 31: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మహానందీశ్వరుడు పల్లకిలో విహరించారు. వేదపండితులు, అర్చకులు భక్తుల సమక్షంలో పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక పల్లకిపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేదమంత్రాలతో ఆశీనులు చేశారు. భక్తి శ్రద్ధలతో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలకీ సేవ నిర్వహించారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా నగర సంకీర్తన



మిడుతూరులో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

మిడుతూరు, మే 31: మిడుతూరులోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జయదేవానంద స్వామి ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుంచి శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవత్‌గీతపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. శుక్రవారం ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చన నిర్వహంచారు. తదనంతరం గోమాతతో నగర సంకీర్తన చేశారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటరామయ్య, ధర్మ ప్రచారకులు రామ్మోహన్, హరిసర్వోత్తమరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటస్వామి, ఈశ్వరరెడ్డి, స్వామన్న, నారాయణ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ



స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలం, మే 31: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులు సమర్పించారు.

అంకాలమ్మకు పూజలు: శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

అలరించిన గాత్రకచేరి: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో నల్లగొండకు చెందిన వేదశ్రీ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో గణపతిని సేవింపరారే, వినాయకకౌత్వం, శివస్తుతి, శంభో.. శివశంభో తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

'విజయోత్సవ ర్యాలీలు నిర్వహించొద్దు'

పాములపాడు, మే 31: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించొద్దని ఎస్ఐ అశోక్ అన్ని పార్టీల నాయకులకు సూచించారు. శుక్రవారం పాములపాడు పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ఫలితాల తర్వాత గ్రామాల్లో అల్లర్లకు పాల్పడవద్దని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మండల వివిధ రకాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి'



శివపురం గూడెంలో మామిడి తోటను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి, మే 31: అటవీ సమీప గూడెంలలో నివసిస్తున్న చెంచు రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారిస్తే మంచి దిగుబడులు సాధిస్తారని ట్రైబల్ స్టేట్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మేనేజర్ నారాయణరెడ్డి, శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం వారు ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ కేజీ నాయక్‌తో కలిసి శుక్రవారం కొత్తపల్లి మండలంలోని శివపురం గూడెం, గుమ్మడాపురం గూడేలలో చెంచు రైతులు సాగు చేస్తున్న మామిడి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయా గూడెలల చెంచు రైతులతో వారు సమావేశమయ్యారు. మామిడి, జామ పంటల్లో రైతులు అంతర్ పంటగా నన్నారి పంటను కూడా సాగు చేస్తే మరిన్ని లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. నన్నారి పంట సాగుకు ఎకరాకు 10వేల మొక్కలతో పాటు వాటికయ్యే ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. రైతులు పండ్ల తోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతాంగానికి ప్రభుత్వం వంద శాతం రాయితీతో మామిది, నిమ్మ, సపోట, జామ, సీతాఫలం, నేరేడు, మునగ తదితర మొక్కలు ఉచితంగా ఇస్తామన్నారు. ఏపీవో రాజు నాయక్, టీఏ బసీరున్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

ఆత్మకూరు రూరల్, మే 31: సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. ఆత్మకూరు మండలంలోని రుద్రకోడూరు చెంచుగూడెంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు నిర్వహించి, వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చెంచులకు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివ,హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, శారద, రవి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'మొండి బకాయిల రికవరీలో జాప్యం వీడండి'



మాట్లాడుతున్న శ్రీనిధి ఏజీఎం నాగప్రసాద్

ఉయ్యాలవాడ, మే 31: మొండి బకాయిల రికవరీలో జాప్యం వీడాలని జిల్లా శ్రీనిధి ఏజీఎం నాగప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సెర్ప్ రికవరీ టీం సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది శ్రీనిధి ద్వారా రూ. 115 కోట్ల రుణాలు పొదుపు మహిళలకు ఇచ్చామన్నారు. వీటిలో రూ. 50 కోట్లు మొండి బకాయిలుగా నిలబడి పోయాయన్నారు. వీటి రికవరీకి కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామన్నారు. ఉయ్యాలవాడ మండలంలో 11 గ్రామెక్య సంఘలకు నుండి రూ. 1.50 కోట్ల మొండి బకాయి ఉండగా కోటి రూపాయలు రికవరీ చేశామని మరో రూ. 50 లక్షలు రికవరీని రెండు నెలల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. పొదుపు మహిళలకు ఇచ్చిన శ్రీనిధి రుణాలను వీవో ఏలు తమ సొంత అవసరాలకు వాడుకున్నట్లు తెలియటంతో పెద్దయమ్మనూరు, సర్వాయిపల్లె వీవోఏలను తొలగించి కొత్త వారిని నియమించామన్నారు. అలాగే సర్వాయిపల్లె, తుడుమలదిన్నె వీవోఏల నుండి వారు వాడుకున్న సొమ్మును రికవరీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 96 శాతం రుణాలను రికవరీ చేస్తున్నామని ఆయన తెలిపారు. కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల క్లస్టర్ల శ్రీనిధి మేనేజర్లు అరుణ్‌కుమార్, ఫరూక్, తేజ, ఏపీఎం దానన్న, సీసీలు గంగన్న, నాగన్న పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి సుబ్బారెడ్డి పరామర్శ



టీడీపీ నాయకుడిని పరామర్శిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, మే 31: హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డోన్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కామగానిగుంట్ల బాలును శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడులు పరామర్శించారు. గుండెజబ్బుతో బాధపడుతున్న బాలుకు హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారు. ఈవిషయం తెలుసుకున్న సుబ్బారెడ్డి, మురళీకృష్ణగౌడులు ఆస్పత్రికి వెళ్లి బాలును పరామర్శించారు.

సూర్యప్రతాపం 45 డిగ్రీలు

నాలుగు రోజులుగా దంచి కొడుతున్న ఎండలు

కొలిమిగుండ్ల రూరల్, మే 31: భానుడు భగ భగ మండుతున్నాడు. దీంతో జిల్లా ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. మొన్నటి వరకు అరకొరగా కురిసిన వర్షాలతో జిల్లాలో చల్లబడిన వాతావరణం తిరిగి ఒక్కసారిగా మళ్లీ వేడెక్కింది. శివమెత్తిన సూర్యుడు తన ప్రకోపాన్ని వెళ్లగక్కుతుండడంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు నమోదైంది. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు బయట తిరగాలంటే భయపడిపోయో పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 8గంటలకే సెగలు కక్కుతున్న భానుడు సాయంత్రం ఆరు దాటినా చల్లబడటం లేదు.

అప్రమత్తంగా ఉండాలి

ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఇళ్లకే పరిమితం కావాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లటి ప్రదేశానికి చేర్చి, శరీర ఉష్ణోగ్రత తగ్గే వరకు చల్లటి బట్టతో శరీరమంతా తుడుస్తూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ నీటిని, లేదా ఓఆర్ఎస్ ప్యాకెట్ తాగించాలి.

\- డాక్టర్ మల్లికార్జునరెడ్డి

టీడీపీ కూటమి విజయం తథ్యం

కోవెలకుంట్ల, మే 31: ఏపీలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారన్నారు. మొదట పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారని, ఈ ఓట్ల ద్వారానే వైసీపీ పతనం ప్రారంభం అవుతుందన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసిగి వేసారిపోయారని అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనలో నష్టపోయారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు

సంజామల, మే 31: రాజకీయ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమేశ్‌రెడ్డి అన్ని పార్టీల నాయకులను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కోవెలకుంట్ల సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈనెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా జరుగాలన్నారు. అకతాయిలు రోడ్డుపైకి వచ్చి రెచ్చగొట్టే చర్య లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో గీతా పారాయణం

కొలిమిగుండ్ల రూరల్, మే 31: మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన శ్రీకృష్ణుడి ఆలయంలో వైశాఖ బహుళ అష్టమిని పురస్కరించుకొని గీతా పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ నిర్వాహకులు బాచం వెంకటశివారెడ్డి, మాజీ సర్పంచ్ మొలక హంశేని ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆధ్యాత్మిక వేత్తలు వైవీఎస్. నారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి గీతా పారాయణం, తత్సంగసేవ చేపట్టారు.

వైభవంగా పవిత్రోత్సవం

చాగలమర్రి, మే 31: చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వైషాఖ మాసం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా పవిత్రోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి మహిళలు సామూహికంగా ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానీ ఆధ్వర్యంలో దీపోత్సవ కార్యక్రమాన్ని చేశారు. పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, మహిళలు పాల్గొన్నారు.

'చిటెక వ్యాధి నివారణ టీకాలు'

చాగలమర్రి, మే 31: గొర్రెలు, మేకల్లో వచ్చే చిటికవ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి దీపకుమారి తెలిపారు. శుక్రవారం నగల్లపాడు, కలుగొట్లపల్లె గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పశువైద్య సిబ్బంది వేస్తున్న టీకాలను ఆమె పరిశీలించారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని చిన్నవంగలి, చింతలచెరువు, కొలుములపేట, పెద్దవంగలి, మద్దూరు, బ్రాహ్మణపల్లె గ్రామాల్లోని గొర్రెలు, గేదెలకు టీకాలు వేస్తున్నామని చెప్పారు.

'300 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం'

చాగలమర్రి, మే 31: మండలంలో 300 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యంగా ఉందని ఏపీవో నిర్మల తెలిపారు. శుక్రవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వంద శాతం సబ్సిడీతో రైతులకు ఉపాధిహామీ ద్వారా 16 రకాల పండ్ల తోటల పెంపకానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి పనులు చేయడానికి గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో టీఏలు ఉన్నారు.

24 రౌండ్లలో బనగానపల్లె ఓట్ల లెక్కింపు

- పోస్టల్ బ్యాలెట్‌కు 3 టేబుళ్లు
- తుది ఫలితం సాయంత్రం 4 గంటలకు..
- రిటర్నింగ్ అధికారి సిరిగిరి వెంకట కామేశ్వరరావు

బనగానపల్లె, మే 31: డోన్ అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిరిగిరి వెంకట కామేశ్వరరావు తెలిపారు. జూన్ 4న నంద్యాల సమీపంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు పటిష్ట భద్రతా చర్యల నడుమ జరుగుతుందని శుక్రవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: బనగానపల్లె నియోజవకర్గం ఓట్ల లెక్కింపు ఎక్కడ చేయనున్నారు ?

ఆర్వో: బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో 277 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. బనగానపల్లె నియోజకవర్గంలో బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలు ఉన్నాయి. నంద్యాల శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఓట్లలెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

ఆంధ్రజ్యోతి: ఓట్ల లెక్కింపు ఎన్ని రౌండ్లలో పూర్తి చేస్తారు?

ఆర్వో: 24 రౌండ్లలో పూర్తి చేస్తాం. బనగానపల్లె అసెంబ్లీ పరిధిలో మొత్తం 277 పోలింగ్ కేంద్రాల్లో 2,3,575 మంది ఓటు వేశారు. ఒక్కో రౌండ్‌కు 12 టేబుళ్లను ఏర్పాటు చేశాం. బనగానపల్లె అసెంబ్లీ పరిశీలకుడిగా ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వేద్‌ప్రకాశ్‌మిశ్రాను కేంద్ర ఎన్నికల కమిషన్‌ను నియమించింది. ఆయన సమక్షంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. ప్రతి రౌండ్‌లో కౌంట్ చేసిన 12 ఈవీఎంలలో ర్యాండమ్‌గా 3 ఈవీఎంలను తీసుకొని మళ్లీ ఓట్ల లెక్కింపు చేస్తాం.



బనగానపల్లె రిటర్నింగ్ అధికారి సిరిగిరి వెంకట కామేశ్వరరావు

ఆంధ్రజ్యోతి: ఓట్ల లెక్కింపు ఎన్ని గంటలకు ప్రారంభం కానుంది ?

ఆర్వో: తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేపడతాం. 2,740 మంది పోస్టల్ బ్యా లెట్‌లో ఓట్లు వేశారు. ఇంకా పోస్టల్ బ్యాలె ట్‌లు వచ్చే అవకాశం ఉంది. మిలిటరీలో పనిచేసే సైనికులు పోస్టల్ బ్యాలె ట్‌లను పంపుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియ 8.30 గంటలకు ప్రారంభం కానుంది.

ఆంధ్రజ్యోతి: తుది ఫలితం ఎన్నిగంటలకు వస్తుంది?

ఆర్వో: బనగానపల్లె అసెంబ్లీ నియోజకర్గం తుది ఫలితం 4 గంటలకు పూర్తిగా వస్తుంది.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఓట్ల లెక్కింపు ఏగ్రామం నుంచి ప్రారంభం అవుతుంది?

ఆర్వో: ఓట్ల లెక్కింపు బనగానపల్లె మండలం పసుపుల గ్రామం నుంచి ప్రారంభమై సంజామల మండలం నొస్సం గ్రామంతో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది.

ఆంధ్రజ్యోతి: ఓట్ల లెక్కింపుకు సిబ్బందిని ఎంతమందిని నియమించారు?

ఆర్వో: ఓట్ల లెక్కింపునకు బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి 70 మందిని నియమించాం. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం. ఒక్కో టేబుల్‌కు సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌తో పాటు నాల్గవ తరగతి ఉద్యోగిని నియమించాం.

ఆంధ్రజ్యోతి: ఎంతమంది ఏజెంట్లకు అనుమతులిస్తున్నారు?

ఆర్వో: గదులు చిన్నవిగా ఉండడంతో అన్ని పార్టీలకు వంద మంది కౌంటింగ్ ఏజెంట్లకు అనుమతిలిచ్చాం. ప్రధాన పార్టీలకు ఏజెంట్ల నియామకంలో ప్రాధాన్యత ఇస్తాం.

ఆంధ్రజ్యోతి: కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు ఘర్షణ పడితే చర్యలేం తీసుకుంటారు?

ఆర్వో: ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు ఘర్షణ పడితే ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. అటువంటి ఏజెంట్లను పోలీసుల సహకారంతో వెంటనే బయటకు పంపిస్తాం. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏజెంట్లు నడుచుకోవాలి. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకు వెళ్లాలి.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న అమ్మవారు

బనగానపల్లె, మే 31: నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మే 31: రుద్రవరంలోని కన్యకారమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

● రుద్రవరంలో కొలువుదీరిన చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం అర్చకులు అభిషేకం తదితర పూజలు చేశారు.

వచ్చేది టీడీపీ కూటమి ప్రభుత్వమే..

- జూన్ 4న వైసీపీ అరాచక పాలన నుంచి విముక్తి
- ఓట్ల లెక్కింపుపై అప్రమత్తంగా ఉండాలి
- డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మే 31: రాష్ట్రంలో వచ్చేది టీడీపీ కూటమి ప్రభుత్వమేనని కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 4న వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలుగుతుందని అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పార్టీ నాయకులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు, ఏజెంట్ల నియామకాలపై చర్చించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క చాన్స్ పేరుతో వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చి రాష్ట్ర వనరులను దోపిడీ చేశారని మండిపడ్డారు. ప్రజలకు మేలు చేయా ల్సిన వైసీపీ ప్రభుత్వమే అరాచకాలు చేస్తూ ఎన్నో ఇబ్బందులకు గురి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ఎంతో మేలు జరుగు తుందని ప్రజలు భావించారన్నారు. వైసీపీకి వ్యతిరేకంగా రాష్ట్రంలో ప్రజలు తీర్పు ఇవ్వడం ఖాయమన్నారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని తేలిపోయిందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో టీడీపీకి చెందిన ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, చిట్యాల మద్దయ్య గౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, భాస్కర్ నాయుడు, మర్రి చక్రపాణి, ఎస్ఎండీ రఫీ, ఆలేబాదు పరమేష్, ఎస్టీ హరూన్, సుధాకర్ రెడ్డి, గోవిందరెడ్డి, బీజేపీ నాయకులు వడ్డె మహరాజ్ పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

ఫలితాలపై పెరుగుతున్న ఉత్కంఠ

- మరింత ఊపందుకున్న బెట్టింగ్‌లు
- ఏపీ ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా సీట్లపై హైదరాబాదులో పందేలు

కొలిమిగుండ్ల రూరల్, మే 31: సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడేకొద్దీ రాజకీయ నేతల్లో, కార్యకర్తల్లో మరింత ఉత్కంఠత పెరుగుతోంది. ఎన్నికల ఫలితాలకు ఇక మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ఎలాంటి ఫలితాలు వెలుబడతాయో అనే ఆసక్తి అందరిలోనూ వ్యక్తమవుతోంది. గెలుపుపై అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నా లో లోపల ఆందోళన మాత్రం తగ్గడంలేదు. మరోవైపు సార్వత్రిక ఎన్నికల్లో తుది విడత పోలింగ్ నేటితో ముగియనుండటంతో ఎగ్జిట్ పోల్స్ శనివారం సాయంత్రం విడుదల కానున్నాయి. దీంతో పందెంరాయుళ్ళ, రాజకీయ వర్గాలు ఎగ్జిట్ పోల్స్ కోసం కూడా ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. అయితే ఫలితాల సమయం దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌ల పర్వం మరింత ఊపందుకుంది. ప్రభుత్వ ఏర్పాటు మొదలుకొని ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. మరోవైపు ఏపీలో ప్రభుత్వ ఏర్పాటు, జిల్లాలోని బనగానపల్లె, శ్రీశైలం, డోన్, ఆళ్లగడ్డ తదితర నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపు, ఓటములపై హైదరాబాదు కేంద్రంగా పందేలు జరుగుతుండడం మరింత ఆసక్తిని రేపుతోంది. జిల్లాలోనే అత్యధికంగా బనగానపల్లె నియోజకవర్గం బెట్టింగ్‌లకు కేంద్రంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. సుమారు 10కోట్లకు పైగా బెట్టింగ్‌లు జరిగినట్లు పలువురు అంచనా వేస్తున్నారు. ఇందులో అత్యధికంగా కాటసాని రామిరెడ్డి గెలుపు, బీసీ జనార్దనరెడ్డి మెజార్టీ, కొలిమిగుండ్ల మండలంలో మెజార్టీ ఏ పార్టీది అన్న అంశంపైనే బెట్టింగులు నడుస్తున్నట్లు సమాచారం. వైసీపీకి కంచుకోటగా వున్న కొలిమిగుండ్ల మండలంలో ఈ దఫా టీడీపీకి మెజార్టీ వస్తుందని, ఆ పార్టీ శ్రేణులు అంచనాలు వేస్తుండగా, అది ఎంత మాత్రం జరిగే పని కాదంటూ వైసీపీ ధీమాగా వుంది. దీంతో ఈఅంశంపై పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు కొనసాగినట్లు తెలుస్తోంది.



బెట్టింగ్‌లపై దృష్టి పెట్టని పోలీసులు: పోలింగ్ సందర్భంగా జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకొని, కౌంటింగ్ సందర్భంగా పెద్ద ఎత్తున జాగ్రత్తలు తీసుకుంటున్న అధికారులు, బెట్టింగ్ రాయుళ్లపై ఏమాత్రం దృష్టి పెట్టలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రూపాయల బెట్టింగ్ చోటుచేసుకున్న దృష్ట్యా, ఫలితాల అనంతరం డబ్బు పంపిణీ సందర్భంగా ఘర్షణలు తలెత్తే అవకాశం వుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చాగలమర్రిలో కార్డన్ సెర్చ్



చాగలమర్రిలో కవాతు చేస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు

చాగలమర్రి, మే 31: సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దిన్ హెచ్చరించారు. శుక్రవారం చాగలమర్రిలో కార్డెన్ సెర్చ్‌లో భాగంగా పలు వీధుల్లో బీఎస్ఎఫ్ దళాలు, పోలీసులు, కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని అన్నారు. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఆదేశించారు. గ్రామంలో ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, బాణసంచా కాల్చడం నిషేధమని చెప్పారు. కార్యక్రమంలో సీఐలు హనుమంతనాయక్, చంద్రబాబు, ఎస్ఐలు రమణయ్య, నరసింహులు, నాగేశ్వరరావు, రామాంజనేయరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎస్పీ షర్ఫుద్దీన్ భరోసా ఇచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం పోలీసులతో కవాతు నిర్వహించారు. ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని నిర్వహించిన కవాతులో ఆయన మాట్లాడుతూ ప్రజలు భయాందోనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలంతా ఓట్ల లెక్కింపు రోజున ఇళ్లలో ఉండాలని, విజయోత్సవ వేడుకలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణ సీఐ రమేష్‌బాబు, రూరల్ సీఐ హనుమంత నాయక్, పట్టణ ఎస్ఐలు నగినా, వెంకటరెడ్డి, రూరల్ ఎస్ఐ నరసింహులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు'



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శిరివెళ్ల, మే 31: డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల జీవ నియంత్రణ ప్రయోగశాల ఏడీఏ సుధాకర్, ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల గ్రామాల్లోని పలు విత్తన దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్‌లు, బిల్లులను పరిశీలించారు. నాణ్యతలేని విత్తనాలను విక్రయించినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శిరివెళ్ల మండల వ్యవసాయాధికారి సుధాకర్, ఆళ్లగడ్డ టెక్నికల్ ఏవో పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి: పీడీఎస్‌యూ

బేతంచెర్ల, మే 31: పట్టణంలో ప్రైవేటు విద్యాసంస్థల పాఠశాలల్లో ముందస్తు అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో ఎంఈవో సోమశేఖర్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, శివ పాల్గొన్నారు.

డోన్ విద్యార్థికి ఉత్తమ అవార్డు

డోన్(రూరల్), మే 31: పట్టణంలోని సెంట్‌జో ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జోనాదన్ విద్యార్థికి ఇంజీనియస్ చాంప్ వరల్డ్ రికార్డులో ఉత్తమ ప్రతిభకు అవార్డు వచ్చింది. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఇంజీనియస్ చాంప్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ కీబోర్డు మ్యూజికల్‌లో ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు దక్కినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఇసాకు, ఎస్తేరు రాణిలు తెలిపారు. ఇంజీనియస్ చాంప్ వరల్డ్ రికార్డు వారు హాలేలుయా మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు దండింగి అగస్టీన్ చేతుల మీదుగా ఈ అవార్డును అంద జేసినట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్యాపిలి, మే 31: గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం పిల్లలను ఆకట్టుకుంటోంది. రోజు గ్రంథాలయానికి దాదాపు 30 మంది పిల్లలు వస్తున్నారు. పత్రికలు, పుస్తక పఠనం చేస్తున్నారు. అలాగే చిన్నారులు ఆట లాడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. గత నెల 5న ప్రారంభమైన ఈ శిబిరం జూన్ 7వరకు కొనసాగుతుందని గ్రంథాలయ అధికారి పద్మావతి తెలిపారు.

ఘనంగా బందేషావలి ఉరుసు

చాగలమర్రి, మే 31: చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం వీధిలో వెలసిన బందేషావలి ఉరుసు మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గా వద్దకు భక్తులు, మహిళలు, పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఫాతేహాలు చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. బెంగుళూరు, మైసూరుకు చెందిన కళా విద్వాంసులతో గొప్ప ఖవ్వాలి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాఠశాలల ఆడిట్

కొలిమిగుండ్ల రూరల్, మే 31: మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల నిధులకు సంబంధించి ఆడిట్ కొనసాగుతోంది. మండలంలో 37 ప్రాథమిక పాఠశాలలు, 10 జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కాగా, 2022-23, 2023-24కు విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల నిధుల జమ ఖర్చు వివరాలను అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఎటువంటి మెయింటెనెన్స్ నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది.

నేడు హనుమజ్జయంతి

కొలిమిగుండ్ల రూరల్, మే 31: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మండలంలోని కోరుమానుపల్లె గుండం అంజనేయస్వామి, మీర్జా పురం బాట అంజనేయస్వామి, హనుమంతుగుండం అభయాంజనేయస్వామి, లొక్కిగుండం అంజనేయస్వామి ఆలయాలతోపాటు, అంకిరెడ్డిపల్లె, నందిపాడు, కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నారు.

ప్యాపిలి: పట్టణంలోని వెంగన్నబావి కొప్పు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'పొగాకు ఉత్పత్తులు వాడొద్దు'

రుద్రవరం, మే 31: పొగాకు ఉత్పత్తులు వాడొద్దని వైద్యురాలు జ్యోతి అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని బెస్తకాలనీలోప్రపంచ పొగాకు నిషేధ దినం సందర్భంగా అవగాహన కల్పించారు. పొగాకు వాడకం పర్యావరణానికి ముప్పు అని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హేమావతి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

రిటైర్డు అధ్యాపకుడికి సన్మానం

డోన్(రూరల్), మే 31: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న బెంజిమెన్ రాజు పదవీ విరమణను పురస్కరించుకుని సబ్ ట్రెజరీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. సబ్ ట్రెజరీ అధికారి ఎంకే రఘునందన్ రిటైర్డు లెక్చరర్ రాజును పూలమాలలు, దుశ్శాలువలతో సన్మానించారు.

వైభవంగా కంబగిరి స్వామి తిరుణాల

సంజామల, మే 31: మండలంలోని పేరుసోములలోని విష్ణుకంచి క్షేత్రంలో వెలసిన కంబగిరి లక్ష్మీనరసింహ స్వామి తిరుణాల వైభవంగా ప్రారంభమ య్యాయి. శుక్రవారం ఉదయం సిద్దలక్ష్మి, ఆదిలక్ష్మి సమేతుడైన స్వామివారికి నిత్యహోమాలు, సుదర్శన హోమం, అన్న కూటోత్సవం, నిత్యపూజలు వేదపండితుల ఆధ్వర్యంలో జరిగాయి. తిరుణాలకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం నిర్వాహ కులు రామ్మోహన్‌స్వామి భోజనం, తాగునీటి వసతి కల్పించారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికథ, చెక్కభజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు రామ్మోహన్‌స్వామి, అర్చ కులు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో తిరుచి ఉత్సవం

బేతంచెర్ల, మే 31: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో శుక్రవారం తిరుచి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారా మచంద్రుడు, వేద పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు బీసీ రాజారెడ్డి పరామర్శ



రామాంజనేయులును పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మే 31: బనగానపల్లె పట్టణ టీడీపీ ఎంపీటీసీ జక్కు కృష్ణన్న కుమారుడు టీడీపీ కార్యకర్త జక్కు రామాంజనేయులును బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శుక్రవారం పరామర్శించారు. రామాంజనేయులు ఇటీవల శాంతిరాం వైద్యశాలలో సర్జరీ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. రాజారెడ్డి అయనను పరామర్శించి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. అలాగే బనగా నపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త నాగార్జున ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బీసీ రాజారెడ్డి పరామర్శించారు.

ఘనంగా మురాద్‌వలి ఉరుసు

రుద్రవరం, మే 31: మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో మురాద్‌వలి ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మేళతాళాలతో జెండాలను గ్రామోత్సవం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భారీ సంఖ్యలో భక్తులు ఫాతెహా చేసేందుకు తరలివచ్చారు. రూ.45 లక్షలతో నూతనంగా మురాద్‌వలి దర్గాను నిర్మించారు.